# మొక్కలు

# మొక్కలు

కొన్ని గంటలక్రితం ఆశ!...?

కానీ...ఇప్పుడు ఆలోచన్లు బీటలు వారిపోయినయ్.

అస్తమించబోతున్న సూర్యుడు ఆయుర్దాయం మూడి పడుస్తున్నట్లూ ... బ్రతకాలనివున్నా సరైన మందులేక ప్రాణం పోగొట్టుకోవాల్సివచ్చిన పేషెంటులాగ...బాధ పడుతున్నాడు మాధవయ్య.

మాధవయ్య మేస్టారి శరీరంలో సత్తువ ఆరిపోబోతున్న దీపం లాగుంది.

గోడకు అతుక్కుపోయిన బల్లిలాగ వాకిట్లోవున్న పాలుకుర్చీలో వెల్లికిలా పడుకుని ఆలోచిస్తున్న మాధవయ్య

నీరసపు చూపులు అప్పుడే ఇంటి గడపలోకి అడుగుపెట్టిన ఆగంతుకుడిమీద పడ్డయ్.

"దండాలండీ పంతులుగారూ!" వస్తూనే అన్నాడు ఆగంతుకుడు.

"ఎవరు కావాలి నీకు?" మాధవయ్య ప్రశ్న.

"ఈ యదవను సమించాలి తమరు" ఇంకా ఏదో చెప్పబోయాడు.

మాధవయ్య విసుక్కుంటూ "కొంపదీసి తాగొచ్చావా ఏమిటి?..."

"బుద్ధి గడ్డితిన్నది. తరువాత మీదని తెలిసి కాళ్ళ మీద పడదామనొచ్చాను..." చతకిలబడుతూ వినయంగా అన్నాడు.

ఆగంతుకుడు బొడ్లోంచి 'పర్సు' తీసి మేస్టారి కిచ్చాడు.

'పర్సు' ను అతగాడి చేతిలోంచి మాధవయ్య లాక్కున్నాడు.

లోపల డబ్బంతా వుందో లేదో అని ఆత్రంగా వెతికారు.

పోగొట్టుకున్న మనీపర్సు...అందులో వున్న డబ్బూ కళ్ళ కవుపించగానే...లంకణాలు చేసిన రోగికి పథ్యం పెట్టినట్టూ...ఓడిపోబోతున్న ముఖ్యమంత్రిగారికి ఒక్కవోటు మెజారిటీ వచ్చి గెలిచినట్టూ...ఎం. ఏ. పాసైన కుర్రాడికి కనీసము 'యల్డీసీ' ఉదోగమైనా దొరికితే పొందే ఆనందం

కంటే వెయ్యింతల సంతోషం మాధవయ్య ముఖంలో పురి విప్పుకుంది. కళ్ళల్లో, మనసులో చిందులు తొక్కింది.

మాస్టారి కళ్ళల్లో కాంతి రేఖలు "యీ పర్సు ఎక్కడ దొరికిందని" అడిగేయ్ ఆగంతుకుడ్ని.

"దొరకలేదండి—ఇందాక బజార్లో తవురి జేబు కత్తిరించాను. పక్క పార్కులో కెళ్ళి చూసుకునే సరికి డబ్బుతో పాటు పర్సులో మీ ఫొటో కూడా అవుపించింది. తవురిని ఆనవాలు పట్టగలిగాను! నా పేణం కలుక్కుమంది. జివ్వన వంట్లో నరాలన్నీ లాక్కుబోయినట్టు బాధపడ్డాను. వెంటనే సెంపలేసుకున్నాను. తవురి కాళ్ళమీద పడదామని ఇట్లా వచ్చా..."

పగిలిన కళ్ళద్దాల్లోంచి చూస్తూ అతడెవరైందీ పోల్చుకోలేకపోయాడు మాధవయ్య.

"నేను నీ కెట్లా తెలుసు?" మాస్టారే అడిగేడు.

"నేను పంతులుగారూ!...నరసయ్యను. గుర్తుబట్టనే లేదా?—సిన్నప్పుడు మీ కాడ సదువుకున్నాను...మాయమ్మ మీ కాడ పాచిపని సేసింది! బీదోడిననేసి వూరికినే సదువు చెప్పారు కూడా!—కానీ, ఈ ఎదవకు చదువబ్బలేదు పంతులుగారూ! అమ్మ చచ్చిపోయింది. నా బతుకే మారిపోయింది. కూటికోసం ఖాళీ కడుపుతో లోకం మీద పడ్డాను - మిల్లులో పనికి కుదిరేను. రోశయ్య టిపినీ కేరేజి పోయింది. ఒకరోజున ఏమీ తెలియని నా మీద దొంగతనం మోపారు. పన్లోంచి యళ్ళగొట్టారు. తర్వాత రిచ్చా లాగాను. ఒక పేసింజరు

రిక్షాలో సంచి మరిచిపోయి వెళ్ళాడు. నేనే కాజేయాలనే బుద్ధితో సంచి తీశానని పోలీసు రిపోర్టిచ్చాడు. ఆపళాన ఈడ్చుకెళ్ళి జైల్లో వేశారు నన్ను. నా కడుపు మండి పోయింది!...మడుసులమీద అసయ్యమేసింది. కట్టపడి బతుకుతున్నా నన్ను దొంగననే అన్నది - నిజంగా దొంగ నెందుక్కాకూడ దన్పించింది. అక్కడ్నించి జేబులు కత్తిరించటానికి అలవాటుపడ్డాను. ఇవ్వాళ అన్నంతిన్న ఇంటికే కన్నం వేశానన్పించింది. తవురికాడ సదువుకుని...చివరికి తమ జేబు కొట్టిన యదవని. నన్ను శమించండయ్యా, కాదు...ఈ యదవని సెప్పుతో కొట్టండి" కాళ్ళమీద పడ్డాడు.

నరసయ్య చిన్నతనం మాధవయ్య మనసులో లీలగా మెదిలింది. కొద్దికొద్దిగా మనిషిని గుర్తుబట్ట గలిగాడు.

"ఓరి నువ్వట్రా?! ఎంతటివాడి వైనావు...మనిషివి బాగా చెడిపోయావ్ సుమీ...అయినా...నీకు ఇదేమి పోయే కాలంరా? అయినా నిన్న నేంలాభం?- ఈ సమాజమే నిన్నిట్లా తయారుచేసింది. నిజాయితీకి రోజుల్లేవు. మంచికి కాలంకాదిది! ఒరేయ్ నువ్వు చేసింది వెధవపనే అయినా...చేస్తున్న తప్పు తెల్సుకున్నావ్. అది చాలు, మనిషికి. ఇక ఆ దేవుడే క్షమిస్తాడు నిన్ను...ఇకనైనా బుద్ధి తెచ్చుకుని ఒక మంచి మనిషిగా బ్రతుకు! - తెల్సిందా?..." మందలింపుగా అన్నాడు.

తన మాటమీద విశ్వాసముంచి వెళ్ళిపోతున్న నరసయ్యను చూస్తూ తృప్తిగా నవ్వుకున్నాడు.

సాయంత్రం ఏడుగంటలు దాటింది.

భోజనంచేసి పంచలో వున్న కుర్చీలో కూర్చుని చుట్ట చుట్టుకుంటున్నాడు మాధవయ్య.

చీకట్లో కూర్చుని ఆశలను నెమరేసుకుంటున్నాడు.

తలుపు కొట్టిన శబ్దం విన్పించటంతో మాధవయ్య భార్యవెళ్ళి వీధివాకిలి గడియ తీసింది.

వాకిలికి యెదురుగా నిల్చుని వున్న పోలీసు ఇన్స్పెక్టర్ని చూచి నిర్ఘాంతపోయింది జానకమ్మ.

ఇన్స్పెక్టర్ సరాసరి లోపలికి దూసుకొచ్చి చుట్ట కాలుస్తున్న మాధవయ్యను సమీపిస్తూ "మాధవయ్య మాష్టారు మీరేనా?.. " అంటూ అడిగాడు.

ఇన్స్పెక్టర్ మాటల్లో అధికారం ధ్వనించింది.

వెలిగించిన చుట్ట ఆర్పేసి "అవును బాబూ! నేనే!" సమాధానంగా జవాబిచ్చాడు.

"మీ ఇల్లు సోదా చెయ్యాలి!"

'ఎందుకని' అడగలేక పోయాడు మాధవయ్య.

"మీరు లంచం తీసుకున్నట్టు మాకు రిపోర్టొచ్చింది" మళ్ళీ ఇన్స్పెక్టరే అన్నాడు.

అందుకు మేష్టారు నిర్ఘాంత పోనూలేదు.

ఇంకా ఏమఘాయిత్యం జరుగనున్నదో అని జానకమ్మ గుడ్లనీళ్ళు కుక్కుకుంది.

మాధవయ్య అంగీకారంకోసం యెదురుచూడకుండా ఇంట్లోకి నడవబోయాడు ఇన్స్పెక్టర్.

"ఆగండి! మీా కా అధికారం వుంది, నే కాదనను. కానీ...నిజంకూడా తెలుసుకోండి!..."

"మిష్టర్ మాధవయ్యా! పరీక్షల్లో సున్నాలొచ్చినా సరే మార్కులువేసి పాస్ చేస్తానని పంచాయితిబోర్డు ప్రెసిడెంటుగారిదగ్గర రెండువందలు లంచం తీసుకోవటం అబద్ధమా? అయినా నిజానిజాలూ...ఋజువులు కావల్సింది కోర్టువారికి. ముందు నా డ్యూటీ నేను చెయ్యాల్సి వుంది!"

'ఇన్స్పెక్టర్! పరువు మర్యాదకోసం, గౌరవ ప్రతిష్టల కోసం, నిత్యమూ ప్రాకులాడే వ్యక్తిని. మంచిచెడ్డను పదిమందికి తెలియచెప్పగల టీచరును. పిల్లలను భావిపౌరులుగా తీర్చిదిద్దగల గురువును...' అని చెప్పాలనుకున్న మాధవయ్య నోరు పెగల్లేదు.

ఇన్స్పెక్టర్ కళ్ళు ఇంటి నాలుగుమూలలూ వెతుకుతున్నయ్.

జానకమ్మకు పరిస్థితి పూర్తిగా అర్థమైంది.

భర్తవేపు అసహ్యించుకున్నట్టు చూచింది! 'బ్రతుకులు బజారునపడే టందుకా ఇంకా చావలేక మనం బ్రతుకుతోంది' అనే భావన ఆమె చూపుల్లో గోచరించింది.

'ఇన్స్పెక్టర్! ఆమె నొక్కసారి చూడండి! కట్టుకున్న భార్యకు నాలుగేళ్ళ కొకసారైనా కట్టుడు చీరెలను కొనిపెట్టే

శక్తిలేని అధముడ్ని - పస్తులుంటున్నాం. అప్పులపాలవు తున్నాం, అయినా వృత్తి ధర్మంకోసం న్యాయా న్యాయ విచక్షణతో తిండికిలేక చస్తున్నా సరే, ఇంతవరకూ చెయ్యిచాచి ఎవ్వరినీ యాచించలేదు. అలాంటి నేను' మాధవయ్య ఆలోచన్లు బాధతో మనసులోనే మూలిగినయ్.

ఇంట్లో పోలీసులు...తల్లి ఏడుపు...తండ్రి అసహాయ స్థితి చూస్తూ ఇంట్లో పిల్లలు బెంబేలు పడ్డారు.

జానకమ్మ ఇంట్లోంచి పంచలో కొచ్చి "ఏమండీ పసి వాడి వొళ్ళు జ్వరంతో మాడిపోతోంది. కళ్ళు తేలేసి వెర్రి చూపులు చూస్తున్నాడు. నాకేదో భయంగా వుంది..." గుండెలు బాదుకుంది.

మాధవయ్య క్షోభ అతని హృదయంలో పెను తుఫానును రేపించి కంఠం మూగవోయింది!

ఇంట్లో కన్పించే ప్రతి దృశ్యం ఇన్స్పెక్టర్ని కది లిస్తోంది.

అవును-ఈ రోజు తాను లంచగొండి!

అయినా...ఇన్నేళ్ళూ నీతిగా బ్రతికిన తన 'మంచి' ఏ చరిత్ర కెక్కింది? పస్తులుంటూ పొట్టలు మాడ్చుకొని చస్తున్నా జాలిచూడని మనుష్యుల దృష్టిలో ఈనాడు తను లంచగొండి. అంతకుమించిన అవినీతిపరుడు!! తన లేమితనా నికి కారకులెవరు? - కారణం ఏమిటి?

అందరూ చేస్తున్నపనే తనూ చేశాడు. తృప్తిపడ్డాడు. దాహం తీర్చుకున్నాడు.

ఏం? తప్పా?—

అలాంటి తనమీద; తన బ్రతుకుమీదా ఇతరుల కెందుకింత పగ?—

జీవితంలో ఓడిపోయినవాడిలాగ తలవంచక తప్ప లేదు.

"నాన్నా! పెద్దక్కయ్యకు మళ్ళీ 'ఫిట్సొ' చ్చింది. నేల మీదపడి తన్నుకుంటోంది!..." గోపీ ఆదుర్దాగావచ్చి చెప్పాడు.

అయినా కదల్లేదు మాధవయ్య.

"అరె...రె! డాక్టర్ కోసం వెడతారా?" మానవత్వ మున్న మామూలు మనిషిగా సానుభూతి ప్రకటించాడు ఇన్స్పెక్టర్.

మాధవయ్యకు తెలుసు!—

డాక్టర్లూ...మందులూ ఏమీ తన కూతురి రోగాన్ని నయంచేయలేవు. పాతికేళ్ళొచ్చి గుండెలమీద కుంపటిగా తయారైన కూతురు పెళ్ళి చెయ్యలేకపోవటమే అందు క్కారణం.

తల అడ్డంగా ఆడించడంకన్నా మరేవిధమైన కదలికా మాధవయ్యలో కన్పించనేలేదు.

'సారీ...' అన్నాడే కానీ కర్తవ్యనిర్వహణ నిర్బం ధించి నోరు మూయించింది ఇన్స్పెక్టర్ని.

ఒక్కటిమాత్రం నిజం! ఎటువంటి అవినీతికీ పాల్పడ

కూడదనే తన ఉద్దేశానికి విరుద్ధంగా...ప్రెసిడెంటు డబ్బు ఆశచూపి...తన బలహీనతకు ఆయన మెత్తుగడను మెరగా వేశాడు - డబ్బు తీసుకుని కొడుకుని పరీక్ష పాసు చెయ్యక పోతే వుద్యోగంలోంచి తీసేస్తానని బెదిరించాడు.

అసలే చాలీచాలని జీతం తనది! పైగా గంపెడు సంసారం! ఈ వృద్ధాప్యంలో చేసుకుంటున్న వుద్యోగం కూడా పోతే ఇందరు బ్రతికేదెట్లా?

అందుకే నరేనని తలూపేడు. సగం సంతోషించి ఇచ్చిన డబ్బు తీసుకున్నాడు!

దాని పర్యవసానం ఇంత దారుణంగా వుంటుందని ఊహించలేక పోయాడు.

గోడకి వ్రేలాడుతున్న పాత ఫొటోమీద ఇన్స్పెక్టర్ దృష్టి కేంద్రీకృతమైంది.

దగ్గరగావెళ్ళి ఫొటో చేతిలోకి తీసుకున్నాడు. అద్దం మీద పేరుకునివున్న దుమ్ము చేత్తో తుడిచాడు. కనుపాపలు పెద్దవిచేసి లైటు వెల్తుర్లో పరీక్షగా చూశాడు.

గతం గుర్తొకొచ్చింది. ఇన్స్పెక్టర్ చిన్నతనం...అతని ఆలోచనను పదిహేనేళ్ళు వెనక్కి లాక్కెళ్ళాయి.

అవును అదేమనిషి!—కాదు...అవును - కాదు. నిజం!! జుట్టు తెల్లబడినా...ముఖం ముడతలుబడినా...కళ్ళు పీక్కు పోయినా శరీరం పాలిపోయినా గుర్తించగలిగేడు. అభిమానం పాలపొంగులా ఇన్స్పెక్టర్ ముఖంలో వ్యక్తమైంది.

"మాష్టారూ? ఇంతసేపూ మీతో మాట్లాడుతున్నా మిమ్మల్ని గుర్తించలేకపోయాను. ఎన్నేళ్ళయింది సార్

మిమ్మల్ని చూచి. నేను సార్? కృష్ణని!! మీ దగ్గరే నాలు గేళ్ళు చదువుకుని ఇంతటివాడి నయ్యాను - నేను సార్! పర మేశంగా రబ్బాయిని!!" కర్తవ్యాన్ని విమర్శించి మామూలు మనిషిలాగ మాట్లాడేడు ఇన్స్పెక్టర్.

మనిషి యెవరైందీ పోల్చుకోలేక పోతున్నాడు మాధవయ్య.

"మాష్టారూ! ఎవరయినా తెలీక తప్పుచేస్తే, సరిదిద్ద వలసిన బాధ్యతగల మీరే...ఇలా చేశారంటే నమ్మలే కుండా వున్నాను. మా వంటివాళ్ళ నెందరినో సమాజంలో మంచి మనుష్యులుగా తయారుచేసి, చదువుచెప్పి, నిజం, న్యాయంనుంచీ ధర్మం నేర్పి మచ్చలేని మనుష్యులుగా బ్రతక మని చెప్పే మీరే...ఇంతటి ఘోరాన్ని యెలా చేయగలి గేరు? ఇలాంటి అవినీతి కెందుకు పాల్పడ్డారు సార్?..."

శిష్యుడనే ప్రతిమాటా, మాధవయ్య వంట్లో రక్తాన్ని కష్టంతో చిలుకుతున్నట్లుంది. గుండెను రంపంతో కోస్తు న్నట్టూవుంది - ఈ బాధ తాను భరించలేక పోతున్నాడు.

"మిమ్మల్ని ఈ విధంగా కలుసుకోవలసి వచ్చినందు కెంతో బాధగావుంది సార్! చిన్నతనంలో పాఠాలు చదివి వప్పగించకపోతే మీ చేతులతో కొట్టారు. ఇప్పుడు, అవే చేతులకు నేను 'బేడీ' లు తగిలించాల్సిన దౌర్భాగ్యం కలిగి నందుకు...సారీ మాష్టారూ! కర్తవ్య నిర్వహణలో తల్లీ, తండ్రీ గురువూ దైవం అనే విచక్షణ వుండకూడదనీ, వుండ దనీ మీరే అన్నారు."

మాధవయ్య నవనాడులూ కృంగిపోయినయ్.

"అవును బాబూ! తప్పు యెవరుచేసినా శిక్షకు పాత్రులే! నా శిష్యుడి చేతుల్లో నేను బందీగా చిక్కటం నా అదృష్టం!! - ఇన్స్పెక్టర్! - ఇప్పుడు మనిద్దరిమధ్యా మమకారాలకు తావులేదు. కాలానికి యెదురునిల్చి నీతిగా, నిజాయితీగా నేను చూపిన బాటలో నా శిష్యులు నడవగలుగుతున్నారు - నేను మాత్రం ఓడిపోయాను. నేను నాటిన మొక్కలే సమాజపు నీతినియమాలకు నీడనిచ్చాయి. ఇంతకంటే మరేమీ చెప్పలేను" అంటూ రెండుచేతులూ అందించాడు మాధవయ్య.

తన పరిస్థితికి ఖిన్నుడవని మాధవయ్య తాను నాటిన మొక్కలే ప్రగతి పురోగమనానికి పునాది రాళ్ళుగా నిల్చినందుకు గర్వపడ్డాడు.